కమనీయం.. సీతారాముల కల్యాణం



శివారెడ్డిగూడలో కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, చైర్ పర్సన్ పావనీయాదవ్

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో సీతారాముల కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. రామాలయాలతో పాటు ఇతర ఆలయాల వద్ద, అన్ని కాలనీలు, బస్తీల్లో చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణ వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. వేద పండితులు సీతారాముల కల్యాణ ఉత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. పానకం, వడపొప్పును భక్తులకు ప్రసాదంగా అందజేశారు. పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు వేడుకల్లో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

– మేడ్చల్ జోన్ బృందం



వేడుకల్లో పాల్గొన్న జవహర్‌నగర్ మేయర్ కావ్య, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహేందర్‌రెడ్డి



కొర్రెముల్ బాలాజీనగర్‌లో.. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు



గుండ్లపోచంపల్లిలో సీతారాముల కల్యాణోత్సవం



ఘనాపూర్‌లో.. జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డి



చీర్యాలలో.. వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ



కొర్రెముల్‌లో.. సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ దంపతులు



మేడ్చల్ వెంకట్రామయ్య కాలనీలో సీతారాముల కల్యాణ వేడుకలు



గుండ్లపోచంపల్లిలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



గౌడవెల్లిలో..



రైల్వే స్టేషన్ కాలనీలో సీతారాముల ఊరేగింపు



దమ్మాయిగూడలో..



కీసరలో.. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



మేడ్చల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మార్వాడీ మంచ్ యువత



చౌదరిగూడలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, సర్పంచ్ రమాదేవిరాములుగౌడ్ దంపతులు

అన్నోజిగూడలో..

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని పలు ఆలయాల్లో గురువారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అన్నోజిగూడలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని భారతి సిమెంట్ బృందం సౌజన్యంతో భక్తులకు అన్నదానం చేశారు. సంస్కృతి టౌన్‌షిప్‌లోని శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపం, రాజీవ్ గృహకల్పలోని ఆంజనేయస్వామి ఆలయం, నారపల్లిలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు.



భారతి సిమెంట్ టీం ఆధ్వర్యంలో అన్నదానం



నాగారంలో..

క్లుప్తంగా...

మహిళలకు కుట్టు మెషిన్లు అందజేత



మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టు మెషిన్లు అందజేస్తున్న దృశ్యం

కీసర: అహ్మద్‌గూడలోని పేద మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టు మెషిన్లు అందించడం అభినందనీయమని నిలోఫర్ డెంటల్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం అహ్మద్‌గూడలోని షాలోమ్ ఆఫ్ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లతో పాటు ఉచితంగా కుట్టు మెషిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి

ఘట్‌కేసర్: భవనం ఐదో అంతస్తులో పని చేస్తున్న కార్మికుడు కిందపడి మృతిచెందిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బీఎన్‌రెడ్డి నగర్ హస్తినాపురానికి చెందిన చింతకింది రమేశ్ (30), రామంతాపూర్ నేతాజీనగర్‌కు చెందిన జంగిలి వెంకటేశం భవన నిర్మాణ కార్మికులు. ప్రస్తుతం వారు కొర్రెముల్ గ్రామంలో రాజరాజేశ్వరి వెంచర్‌లోని భవనంలో పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం వీరు ఐదో అంతస్తులో పని చేస్తుండగా రమేశ్ కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని వెంటనే మేడిపల్లిలోని శ్రీకర ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. బిల్డర్ వెంకటేశ్వర్లు అశ్రద్ధ వల్లే రమేశ్ మరణించాడని మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కీసర: నాగారం మున్సిపాలిటీ 9వ వార్డులోని ఎస్వీనగర్ కాలనీలో అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ కొమురెల్లి అనితాసుధాకర్‌రెడ్డి దంపతులు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని ఆలయ అభివృద్ధికి రూ.60 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భిక్షపతి, కేసీఎస్‌రెడ్డి, ఏకేనాయుడు, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర‌రెడ్డి, హరిప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీపై దాడికి పాల్పడిన నిందితుల గుర్తింపు

కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ కృష్ణానగర్ కాలనీలో రెండు రోజుల క్రితం దాడికి గురైన ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీపై దాడికి పాల్పడిన నిందితులను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నలుగురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారని వారిలో ఆరె సంఘం మాజీ అధ్యక్షుడు కిషన్‌రావు కుమారుడు నానాజీ ఉన్నట్లు గుర్తించామన్నారు. మిగితా నిందితుల ఆచూకి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

బోడుప్పల్: సవరణ బడ్జెట్‌పై శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మేయర్ సామల బుచ్చిరెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు బోడుప్పల్ ఇన్‌చార్జి కమిషనర్ వాణిరెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. కార్పొరేటర్లు పాల్గొని బడ్జెట్‌పై చర్చించాలని కోరారు. పలు సూచనలు, సలహాలు అందించాలని ఆమె సూచించారు.

జవహర్‌నగర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సురేందర్‌రావు

కాప్రా: జవహర్‌నగర్ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఏఎస్‌రావునగర్‌కు చెందిన పెంచాల సురేందర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్ఎండీఏ పరిధిలోని సుమారు 37 మున్సిపాలిటీలకు స్టాండింగ్ కౌన్సిల్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా జవహర్‌నగర్ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా సురేందర్‌రావును నియమించారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బోడుప్పల్: బోడుప్పల్ ఇందిరానగర్ చౌరస్తాలో గురువారం దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ప్రథమ సభల గోడ పత్రికను సీపీఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ ఆవిష్కరించారు. మొదటి మహాసభను మార్చి 31వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దండు రమేష్, మాచర్ల కనకయ్య, నాయకులు సోమరాజు, లక్ష్మమ్మ, నాగారపు రజిత, మాధవ్, స్వరూప, సత్యమ్మ పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆవరణలో అపరిశుభ్రత

రంగారెడ్డినగర్: లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన శ్మశానవాటిక ఆవరణ అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని విజయ్‌నగర్ కాలనీలో రూ.70 లక్షలు వెచ్చించి ఎస్సీ శ్మశానవాటికను అభివృద్ధి చేశారు. అందులో భాగంగా డ్రైనేజీ లైన్ ఏర్పాటుతో పాటు స్నానపు గదలు వంటివి నిర్మించారు. అయితే చుట్టుపక్కల నివసించే వారు శ్మశానవాటిక ఆవరణలో చెత్తాచెదారాలను వేస్తుండడంతో డంపింగ్ కేంద్రంగా మారింది. శ్మశానవాటిక ప్రవేశ ద్వారం మొదలుకుని ఆవరణ అంతా చెత్త ఉండడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పాటు శ్మశానవాటిక ఆవరణలో ఉన్న డ్రైనేజీ నాలా పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్మశానవాటిక ఆవరణలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



విజయ్‌నగర్‌కాలనీలోని చెత్తాచెదారంతో నిండిపోయిన ఎస్సీ శ్మశానవాటిక ఆవరణ

విద్యార్థులకు మానవీయ విలువలు నేర్పించాలి



రామంతాపూర్: ఇందిరానగర్‌లోని ప్రతిభ విద్యానికేతన్ హైస్కూల్లో గురువారం నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుబాష్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు మానవీయ విలువలు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ గాదె సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు ప్రియాంక, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కల దాడి

మల్లాపూర్: ఆరు బయట ఆడుకుంటున్న ఓ బాలుడు, బాలికపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన గురువారం నాచారంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాచారం రాఘవేంద్రనగర్‌కు చెందిన రష్మిక (04), ఇందిరానగర్‌కు చెందిన ఆదర్శ్(11) సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడిచేసి కాళ్లు, చేతులపై కరిచాయి. చికిత్సం నిమిత్తం వారిని నాచారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకుకెళ్లారు. రాఘవేంద్రనగర్, ఇందిరానగర్ కాలనీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో భయాందోళనకు గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



బాలుడి కాలిపై కుక్క కరిచిన గాయాలు

సురేందర్‌రావుకు సత్కారం

కుషాయిగూడ: జవహర్‌నగర్ మున్సిపాలిటి స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన న్యాయ వాది పెంచాల సురేందర్‌రావును గురువారం మాజీ మేయర్ బొంతు రాంమోహన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు వంజరి ప్రవీణ్, రేగళ్ల సతీష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కరుణాకర్, బాల్‌నరసింహ, సందీప్ సుభాష్, న్యాయవాది యాట భాస్కర్, దశరథ తదితరులు పాల్గొన్నారు.



కెన్యాలో తేనెటీగల దాడిలో నగరవాసి మృతి

ఉప్పల్: కెన్యాలో జరిగిన తేనె టీగల దాడిలో నగరానికి చెందిన ఓ వ్యక్తి మృతిచెందాడు. మృతుడి సోదరుడు జితేంద్రాచారి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపుర మండలం ధర్మారావుపేటకు చెందిన పడకంటి బ్రహ్మాచారి(55) దంపతులు ఉప్పల్‌లోని కావేరినగర్‌లో నివాసముంటున్నాడు. మూడేళ్ల క్రితం కెన్యా దేశంలోని టాంజనియా రాష్ట్రంలో వ్యవసాయం చేయడానికి వెళ్లాడు. అక్కడ వ్యవసాయ క్షేత్రాలను లీజుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పంట చేలలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా బ్రహ్మాచారిపై తేనెటీగలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ భారత కాలమాన ప్రకారం గత సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. బ్రహ్మాచారికి ఇద్దరు కుమార్తెలు శ్రుతి, శ్రావిక ఉన్నారు. పెద్ద కూతురు శ్రుతికి వివాహం అయ్యింది. వచ్చే సోమవారం ఉప్పల్‌కు బ్రహ్మాచారి మృతదేహాన్ని తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



మల్కాజిగిరి: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మల్లికార్జుననగర్‌కు చెందిన బొండ్ల ప్రకాష్ జిరాక్స్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 30న తెల్లవారుజామున ప్రకాష్ తల్లిదండ్రులు అయోధ్య టూర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చారు. కొద్ది సేపటి తర్వాత బయటకు వెళ్లిన ప్రకాష్ తండ్రి నర్సింహ(75) ఇంటికి తిరిగి రాలేదు. ఆచూకి కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అదుపు తప్పిన బైక్.. వ్యక్తి మృతి

కుషాయిగూడ: బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. చర్లపల్లి మధుసూదన్‌రెడ్డి కాలనీకి చెందిన కొడిమల్ల ప్రణయ్ (27) రాంపల్లిలోని ఓ వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి మిత్రులతో కలిసి మద్యం తాగాడు. ప్రణయ్ ఇంటికి వెళ్తున్న క్రమంలో తన మిత్రుడి నుంచి ఫోన్ వచ్చింది. తన బైక్‌లో పెట్రోల్ అయిపోయిందని, తీసుకురావాలని కోరాడు. దీంతో బాటిల్‌లో పెట్రోల్ తీసుకెళ్లి మిత్రుడికి ఇచ్చిన అనంతరం ఈసీఐఎల్ నుంచి చర్లపల్లి వైపు వెళ్తుండగా గణేష్ కమాన్ సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన ప్రణయ్ ఘటన స్థలంలోనే మృతిచెందాడు. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాద విషయాన్ని పోలీసులకు తెలిపాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధ్యత ఉండక్కర్లేదా..?



మేడ్చల్ పెద్ద చెరువులో వ్యర్థాలు

- చెరువుల అభివృద్ధిని మరిచిన పాలకులు
- బాధ్యత మరిచి వ్యవహరిస్తున్న ప్రజలు
- వెరసి కలుషితం బారిన స్వచ్ఛమైన నీరు

స్వచ్ఛమైన నీటితో, చుట్టూ పచ్చటి చెట్లతో ఆహ్లాదాన్ని పంచాల్సిన చెరువులు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. ప్రజల బాధ్యతారాహిత్యం, అధికారుల నిర్లక్ష్యంతో మేడ్చల్ పట్టణంలోని చెరువులు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. పట్టించుకోవాల్సిన ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారు. నియోజకవర్గానికి సాక్షాత్తూ ఓ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా చెరువుల అభివృద్ధిలో ఇంతటి నిర్లక్ష్యం ఏంటని ప్రజలు మండిపడుతున్నారు.

మేడ్చల్: పట్టణంలో ఉన్న ప్రధాన చెరువులైన పెద్ద చెరువు, తుమ్మ చెరువు చెత్తమయంగా మారుతున్నాయి. సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు, వ్యాపారులు ఇష్టానుసారంగా చెత్త వేస్తుండడంతో చెరువులు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. మేడ్చల్ పెద్ద చెరువు అలుగుల వద్ద, చెక్ పోస్ట్ నుంచి వచ్చే దారిలో కింది బస్తీ ఇళ్ల వద్ద చెత్త పేరుకుపోతోంది. మేడ్చల్ పట్టణంలో ఆరు బయట చెత్త వేసినా, మలమూత్ర విసర్జన చేసినా రూ.500 జరిమానా విధిస్తామని బోర్డులు ఏర్పాటు చేసినా ఎలాంటి ఫలితం ఉడడం లేదు. వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా వ్యాపారులు, సమీప ప్రాంతాల ప్రజలు ఇష్టానుసారంగా చెత్త వేస్తుండడంతో చెరువుల్లోని నీరు కలుషితమవుతోంది. చెరువు అంచులలో చెత్త వేయడం, అది నీటిలో మునిగి పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. కొబ్బరి బోండాలు, పనికిరాని వస్తువులతో పాటు ఇతర వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో చుట్టి చెరువు వద్ద పడేస్తున్నారు. రోజుల తరబడి అక్కడే ఉంటుండడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ ప్రదేశాలతో పాటు పెద్ద చెరువు, తుమ్మ చెరువు, గౌడవెల్లికి వెళ్లే కుంటలలో చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తుమ్మ చెరువు పరిస్థితి ఇదీ..

చెరువుల్లో కలుస్తున్న మురుగు నీరు..

సమీప ప్రాంతాల నుంచి వస్తున్న మురుగు నీరు చెరువుల్లో కలుస్తుండడంతో అవి కలుషితమవుతున్నాయి. మేడ్చల్ పెద్ద చెరువులోకి చెక్ పోస్ట్ వైపు ఉన్న ఇళ్ల నుంచి మురుగు నీరు వచ్చి చేరుతోంది. కింది బస్తీలోని కొన్ని ఇళ్ల నుంచి వస్తున్న మురుగు సైతం చెరువులోనే కలుస్తోంది. తుమ్మ చెరువుకు పైభాగాన ఉన్న కాలనీలు, ప్రాంతాల నుంచి మురుగు నీరు వచ్చి చెరువులో కలుస్తోంది.

సుందరీకరణ దిశగా పడని అడుగులు..

మేడ్చల్ పట్టణంలో ఉన్న చెరువులను సుందరీకరించి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని మంత్రి మల్లారెడ్డి పలుమార్లు ప్రకటించినప్పటికీ ఆ దిశగా అడుగు ముందుకు పడలేదు. పట్టణం మధ్యలో ఉన్న తుమ్మ చెరువు నీరు కలుషితం కావడంతో ఈ నీటిని పూర్తిగా తొలగించాలని, చెరువులో మట్టి తీసి ఆ తర్వాత నీటితో నింపాలని గతంలో ప్రతిపాదనలు చేశారు. అయితే నీటిని వదిలితే దిగువన ఉన్న కాలనీల ప్రజలు ఇబ్బందులు పడతారని ఈ ప్రతిపాదనను పక్కన పెట్టారు. కౌన్సిలర్లు ప్రజలకు అండగా ఉండి నీటిని వదలొద్దని తీర్మానం చేశారు. తుమ్మ చెరువు నుంచి కాలువలు తవ్వి నీటిని డ్రైనేజీలో కలిపాలని, ఆ తర్వాత చెరువును సుందరీకరించాలని పట్టుబట్టారు. ఇటీవల ఆర్టీసీ కాలనీ వద్ద తుమ్మ చెరువు కట్టపై నిర్మించిన మైసమ్మ ఆలయం ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి తనకు చెరువులను అభివృద్ధి చేయాలని ఉందని, నీటిని దిగువకు పంపించే భాధ్యత కౌన్సిల్ తీసుకోవాలని సూచించారు. మంత్రిది ఒక మాట, కౌన్సిలర్లది ఒక మాట కావడంతో చెరువుల సుందరీకరణకు అడుగులు ముందుకు పడడం లేదు.